క్లుప్తంగా

ప్రతీ కూలీకి పనికల్పించాలి



మాట్లాడుతున్న పీడీ సన్యాసయ్య

ముదిగొండ: ఉపాధిహామీలో అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించాలని పీడీ సన్యాసయ్య సూచించారు. ముదిగొండలో గురువారం ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు కూలీలకు రూ.307 కూలి పడేవిధంగా చూడాలన్నారు. అనంతరం కూలీల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ రంగనాయకమ్మ, ఈసీ వెంకటేష్, టీఏలు చారి, కొమరయ్య, నరేష్, నగేష్ పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై రఫీ

ఏన్కూరు: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్సై రఫీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 8 మండలాల స్థాయి క్రికెట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వలన క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ రైతుబంధు అధ్యక్షుడు మేడ ధర్మారావు, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కవిత

ఎర్రుపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి యన్నం శ్రీనివాస రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శీలం కవిత తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు, ఆటో కార్మికులకు రూ.12వేలు, ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని ప్రకటించి అమలు చేయడం లేదన్నారు. రోడ్ల నిర్మాణం ఒక్కటే అభివృద్ధి కాదన్నారు. ఈ సమావేశంలో మండల నాయకులు రామిశెట్టి రామకృష్ణ, ఎన్.కాశేశ్వరరావు, బొర్రా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్త..



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సత్తుపల్లిటౌన్: ఎండ తీవ్ర ఎక్కువగా ఉన్నందున ఇంటి పట్టునే ఉంటూ వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గంగారం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అవినాష్ అన్నారు. గురువారం మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో ఉపాధి కూలీలు, రోజువారీ కూలీలు, వృద్ధులకు ఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సూచికబోర్డులు లేక.. ప్రమాదకరంగా మారిన సోలార్ ప్లాంట్ రోడ్డు మూలమలుపు



ఓసీ రోడ్డు మూలమలుపు



బొద్రాసికుంట చెరువు మూలమలుపు వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

ప్రాణాలు పోతున్నాయ్..

ప్రమాదకరంగా కారేపల్లి - ఇల్లెందు రోడ్డు

- కనీసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం
- తరచూ ప్రమాదాలు
- నిర్లక్ష్యం వీడని అధికారులు, ప్రజాప్రతినిధులు

కారేపల్లి: కారేపల్లి – ఇల్లెందు ప్రధాన రహదారిలో.. ఇల్లెందు పట్టణానికి సమీపంలో ఉన్న సోలార్ ప్లాంట్, ఓసీ రోడ్డు మూలమలుపుల్లో.. తరుచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ఘటనల్లో కొందు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయలపాలై వికలాంగులుగా మారుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు అధికారులకు గానీ, ఇటు పాలకులకు గానీ పట్టించుకున్న పాపానా పోలేదు. ప్రాణాలు పోతుంటే పట్టించుకోరా అంటూ వాహనదారులు, గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

కారేపల్లి నుంచి ఇల్లెందు వరకు 10కిలో మీటర్లు ఉంటుంది. వాహనదారులు కారేపల్లి, అప్పాయిగూడెం, ఎన్టీఆర్ నగర్, గాజులతండా, భాగ్యనగర్‌తండా, ఆలియాతండా గ్రామాలతో పాటు, సోలార్ ప్లాంట్, ఓసీ రోడ్డుల మీదుగా ఇల్లెందు చేరుకోవాలి. కాగా.. భాగ్యనగర్‌తండా గ్రామం నుంచి ఇల్లెందు వరకు 5కిలో మీటర్ల మేర రహదారి అత్యంత మూలమలుపులతో ప్రమాదభరితంగా ఉంటుంది.

సూచికబోర్డులు కరువు..

ఈ రహదారిలో గడిచిన ఆరు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడంతో పాటు కాళ్లు చేతులు విరిగి వికలాంగులుగా మిగిలిపోయిన వారు ఉన్నారు. మూలమలుపు వద్ద ఎలాంటి సూచిక బోర్డులు గానీ, రేడియం లైట్లు గానీ లేవు. దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ మార్గంలో తరుచూ ప్రమాదాలు జరగటం వాహనదారులు ప్రాణాలు కోల్పోవటం పరిపాటిగా మారింది.

మచ్చుకు కొన్ని..

- గత సంవత్సరం అక్టోబర్ 2న.. మండలంలోని గుట్టకిందిగుంపు గ్రామానికి చెందిన ఉండం సూర్యనారాయణ – సుగుణ దంపతులు ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో సోలార్ ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నక్క వెంకటేష్, ఆలియాతండా చెందిన ధరావత్ రాజు మరో బైక్‌పై ఇల్లెందు వెళ్తున్నారు. ఈ క్రమంలో భాగ్యనగర్‌తండా బొద్రాసికుంట చెరువు, ఆంజనేయస్వామి టెంపుల్ మూలమలుపులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనగా.. ఇద్దరు దంపతులతో పాటు, నక్క వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు తీవ్ర గాయాలపాలై బతికిబయటపడ్డారు.
- గత సంవత్సరం అక్టోబర్ 26న ఇదే రహదారిలో ఆలియాతండా గ్రామం వద్ద మూలమలుపులో.. కారేపల్లి శ్రీవెంకటసాయినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చాందావత్ లక్ష్మణ్ బైక్‌పై పాఠశాలకు ఇల్లెందు ఇళ్తుండగా.. కారేపల్లికి చెందిన మణికొండ పవన్ ఇల్లెందు నుంచి ద్విచక్రవాహనంపై వస్తూ.. మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. దీంతో.. ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌తోపాటు, యువకుడు పవన్ సైతం తీవ్రగాయాలపాలైయ్యారు. ఈ ప్రమాదంలో లక్ష్మణ్‌కు కాలు విరిగింది.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో సోలార్ ప్లాంట్ మూలమలుపు వద్ద ఉసిరికాయపల్లి గ్రామానికి చెందిన మారుతి వెంకటేష్, ఎల్లావుల మల్లయ్య, నర్లావుల వీరబాబులు ద్విచక్రవాహనంపై ఇల్లెందు వస్తుండగా, ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహణం ఢీకొనడంతో మారుతి వెంకటేష్, ఎల్లావుల మల్లయ్యలు మృతి చెందగా, వీరబాబుకు కాలు విరిగింది.
- ఏడాది క్రితం ఇల్లెందు పట్టణం జగదాంబ సెంటర్ చెందిన రాహుల్.. సోలార్ ప్లాంట్ మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బొల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- రెండు సంవత్సరాల క్రితం కారేపల్లి అంబేడ్కర్ నగర్‌కు చెందిన యువకుడు ఆదెర్ల వరుణ్ ఇల్లెందు నుంచి కారేపల్లి ద్విచక్రవాహనంపై వస్తూ. .సోలార్ ప్లాంట్ వద్ద బైక్ అదుపుతప్పి లోయలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఇప్పటికైనా.. సంబంధిత అధికారులు స్పందించి వాహనదారులకు ప్రాణసంకటంగా మారిన కారేపల్లి – ఇల్లెందు రహదారిలో సూచికబోర్డులతో పాటు, రేడియం లైటింగ్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డేంజర్ జోన్‌గా మారింది..



సోలార్ ప్లాంట్ రోడ్డు డేంజర్ జోన్‌గా మారింది. మూలమలుపులు, రోడ్డుకు ఇరువైపులా లోయలు ఉన్నాయి. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక అనేక ప్రమాదాలు జరిగాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డులో సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లతో పాటు, రేడియం లైట్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

– భూక్యా మాన్‌సింగ్, ఉసిరికాయపల్లి

‘భూ భారతి’తో సమస్యలు పరిష్కారం

బోనకల్: రైతు సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తహసీల్దార్ పున్నం చందర్ కోరారు. గురువారం మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో నిర్వహించిన సదస్సులో 139 దరఖాస్తులు రాగా.. ఆళ్లపాడులో 185 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎక్కువ భాగం పట్టాదారు పాస్‌పుస్తకాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ చందర్, అడిషనల్ తహసీల్దార్ రాంబాబులు మాట్లాడుతూ.. భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్క రైతు రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్, మైథిలీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ కోసం గ్రామసభలు



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఏన్కూరు: సీతారామ ప్రాజెక్టు కాలువ పరిధిలో భూ సేకరణ కోసం మండలంలోని నాచారం, మేడేపల్లి, హిమాంనగర్ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఎస్ఆర్ ఎల్పి డిస్ట్రిబ్యూటరి ప్యాకేజీ'2 గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, ఇరిగేషన్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు మంత్రి తుమ్మల ఆదేశం



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన కేశ్వాపురం గ్రామస్తులు

తల్లాడ: మండలంలోని కేశ్వాపురం వద్ద గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రోడ్డు నుంచి ఎల్లమ్మ గుడి వరకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించేందుకు కేశ్వాపురం వద్దకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆ గ్రామస్తులు కలిశారు. ఖమ్మం దేవరపల్లి నుంచి 280 మీటర్ల పొడవునా ఎల్లమ్మ గుడి వరకు అప్రోచ్ రోడ్డు, వాగుపై చప్టా నిర్మించాలని మంత్రి తుమ్మలను గ్రామస్తులు కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి అప్రోచ్ రోడ్డు, చప్టా నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని నేషనల్ హైవే అథారిటీ మేనేజర్ దివ్య, కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో కలకొడిమ సొసైటీ చైర్మన్ దిరిశాల నరసింహారావు, మాజీ సర్పంచ్ డి.రాజారావు, నారికొండ శ్రీనివాసరావు, మహిళలు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి..

కొణిజర్ల: ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేలో రైతుల సౌకర్యార్థం మండలంలోని పెద్దగోపతి సమీపంలో సర్వీస్ రోడ్డు సౌకర్యం కల్పించాలని పలువురు రైతులు గురువారం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయంపై వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను రైతులు కోరగా ఆయన స్వయంగా తుమ్మలను కలిసి సమస్యను విన్నవించగా.. మంత్రి రోడ్డు ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరావు, నాయకులు రంజిత్, రైతులు బాబు, వెంకటేశ్వర్లు, మురళి, రాము, శ్రీను, రమేష్, రాంబాబు, సత్యనారాయణ, తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులు, సలహాలు, సూచనల కోసం 9959225962కు ఫోన్ చేయాలని కోరారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



చిన్నారులతో ఫాదర్ శౌరి

వైరా: వైరాలోని ఆర్‌సీఎం చర్చి 40వ వార్షికోత్సవాన్ని గురువారం చర్చి ఫాదర్ మాదాసు రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ తప్పెట శౌరి దివ్య బలిపూజ నిర్వహించి దివ్య సత్ప్రసాదం అందించారు. అనంతరం గురువులను చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు ప్రదీప్‌రెడ్డి, అల్లం జ్యోతిరెడ్డి, రాజేష్ , రవి, జోసెఫ్, జోజప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కల్పతరురోడ్‌లో సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా గురువారం రూ. 4.50 లక్షలతో 160 కేవీఏ కెపాసిటి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో 100 కేవీఏ కెపాసిటి ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా లోడ్ పెరగటంతో ముందస్తు చర్యల్లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటి పెంచి ఏర్పాటు చేశామని ఏడీఈ బి.ప్రసాద్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపూడి వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం మిట్టపల్లి నాగేశ్వరరావు తనయుడు అభిషేక్ జన్మదిన వేడుకలను పురస్కరించుకోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి వృద్ధులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు చింతలపూడి వెంకటేశ్వరరావు, ఏడునూతల బుచ్చిరామారావు, చెరుకూరి శ్రీనివాసరావు, షేక్.లాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

- **చిరస్మరణీయుడు వంగాల బసవయ్య**

బోనకల్: చిరస్మరణీయుడు వంగాల బసవయ్య అని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి ఆయన సేవలను కొనియాడారు. మోటమర్రి గ్రామ మాజీ సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడు, సీపీఐ మండల కార్యదర్శిగా పనిచేసిన ఆయన.. 11వ వర్ధంతి గురువారం నిర్వహించారు. మోటమర్రిలో ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బెజవాడ రవి, యంగల ఆనందరావు, వంగల కృష్ణ, బుర్రి నాగేశ్వరరావు, వంగాల బ్రహ్మం, నరేందర్, మరీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- **మంత్రి తుమ్మల పరామర్శ..**

సత్తుపల్లిరూరల్: మండలంలోని బేతుపల్లిలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివవేణు, మన్నేని రాఘవయ్య కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట సీనియర్ నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, వెల్ది జగన్మోహన్‌రావు, వేంపాటి లక్ష్మీనారాయణ, పాకలపాటి శ్రీను పాల్గొన్నారు.

- **ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి..**

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివవేణు తల్లి లక్ష్మీతాయారమ్మ ఇటీవల మరణించగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి గురువారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజదేవి, దొడ్డా శ్రీనివాసరావు, తోట సుజలరాణి, బుక్కా కృష్ణవేణి, మలిరెడ్డి మురళీరెడ్డి పాల్గొన్నారు.

- **వ్యాపారి గాంధీకి మాజీ ఎమ్మెల్యే నివాళి**

కారేపల్లి: మండలంలోని మాణిక్యారం (కోయగుంపు) గ్రామానికి చెందిన వ్యాపారి గుండా గాంధీ సంస్మరణ కార్యక్రమానికి వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ గురువారం హాజరైయ్యారు. ఈ సందర్భంగా గుండా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సొసైటీ డైరెక్టర్ కొత్తూరి రామారావు, మాజీ సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు రంగరావు, కిషన్, సీతారాములు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

- **తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి**

వైరా: ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. వైరాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆ పార్టీ నాయకులు గురువారం సందర్శించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రక్షణ లేకుండా పోయిందని, ఐకేపీ కొనుగోలు కేంద్రాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నాటకం ఆడుతుంది తప్ప రైతులకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, భూక్యా శ్యామ్, నరుకుల వెంకటేశ్వర్లు, గుత్తా వెంకటేశ్వర్లు, మందడపు సుబ్బారావు, నల్లగట్ల ప్రవీణ్, మనబోలు వెంకటకృష్ణ, దోసపాటి కల్యాణ్, బండారు నరేష్, రవీందర్, రామారావు, వీరభద్రం, అంజయ్య, నాగేశ్వరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

- **చెట్లను పెంచాలి..**

మధిర: ఉష్ణోగ్రతలను సమతుల్యం చేసేందుకు పచ్చని చెట్లను పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ సామాజిక సేవకుడు లంకా కొండయ్య తెలిపారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో గతంలో నాటిన మొక్కలకు గురువారం ఆయన నీళ్లు పోసి మాట్లాడారు. ఎండలకు ఎండుతున్న మొక్కలకు నీరుపోసి కాపాడాలని కోరారు. మానవ మనుగడకు, కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు చెట్లు దోహదపడతాయని పేర్కొన్నారు. పలుచోట్ల రోడ్లవెంబడి ఉన్న చెట్లకింద చిరువ్యాపారులు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని, మరికొందరు సేదతీరుతున్నారని తెలిపారు. పేదవాడి ఎయిర్ కండిషన్ చెట్ల నీడ అని అన్నారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకై ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఎంపీడీఓ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదవుకునే విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, యోగా, గుడ్ హ్యాండ్ రైటింగ్ వంటి పలు అంశాలపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. శిక్షణకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సలాది రామారావు, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



తల్లాడ: మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

వైరా/కొణిజర్ల/తల్లాడ: కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని టీయూసీఐ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీమేసీ, బీఆర్ఎస్ కేవీ నాయకులు యలదండి బాబు, అనుమోలు రామారావు, గారపాటి అశోక్, వీరబాబు, మద్దెల రవి పిలుపునిచ్చారు. గురువారం వైరాలోని విక్రమ్ భవన్‌లో నిర్వహించిన కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. అదే విధంగా కొణిజర్లలో నిర్వహించిన ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు తాళ్లపల్లి కృష్ణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు కొప్పుల కృష్ణయ్య, స్వర్ణ రమేష్ , పాశం అప్పారావులు పాల్గొని మాట్లాడారు. తల్లాడలోని దొడ్డా కృష్ణయ్య భవనంలో సీపీఎం మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్‌కోడ్‌లు అమలు చేయాలని కుట్ర చేస్తుందన్నారు. కార్మికులు అంతా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు విఠల్‌రావు, టీయూసీఐ నాయకులు శ్రీనివాసరావు, లాల్‌మియా, కృష్ణయ్య, మస్తాన్, నాగేశ్వరరావు, నరేష్, రాణి, లింగయ్య, ఎల్లారావు, రాఘవరావు, నాయకులు కుటుంబరావు, మాధవరెడ్డి, సీతారాములు, శ్రీనివాసరావు, ధనరాజ్, యోహాన్, అంజయ్య, సోమయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మడిపల్లి గోపాల్‌రావు

బోనకల్: దుమ్ముగూడెం ప్రాజెక్ట్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి గోదావరి జలాలను పాలేరులో కలపాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు, జొన్నలగడ్డ సునీత, చిట్టిమోదు నాగేశ్వరరావు, తెల్లాకుల శ్రీను, బందం శ్రీనివాసరావు, గుగులోతు నరేష్, వీరబాబు, కందికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సన్మానం



కార్తీక్ రెడ్డిని సన్మానిస్తున్న జడ్జి, న్యాయవాదులు

మధిర: మధిర కోర్టు నుంచి వనపర్తి కోర్టుకు బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డిని గురువారం మధిర బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మధిర కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి మానవతా విలువలతో ఉన్నతమైన వ్యక్తి అని తెలిపారు. ఎప్పుడు పేద, బడుగు బలహీన వర్గాల గురించి ఉన్నతంగా ఆలోచించి న్యాయం చేయాలనే తపన ఉన్న గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయమూర్తి ఎవరైనా బార్ అసోసియేషన్, బెంచ్ కలిసి జోడెడ్ల మాదిరిగా ప్రయాణం చేస్తేనే న్యాయార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీపీ భద్రయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, కట్టా పూర్ణచంద్రరావు, కావూరి రమేష్, పల్లపోతుల కృష్ణారావు, నెల్లూరు రవి, శ్రీనివాసరావు, సతీష్, విజయ్ కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామంలో లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన వంగా లక్ష్మీనారాయణ, పగడాల మంగమ్మ, కూరాకుల లక్ష్మీనారాయణ లకు వైద్య ఖర్చుల నిమిత్తం భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.1.19 లక్షల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున్, కంచం కోటేశ్వరరావు, బొల్లకొండ రామారావు, తిరుపతి అంజయ్య, వలమల రామారావు, గోద ప్రసాద్, నర్సింశెట్టి చలమయ్య, వలమల వెంకట్రామయ్య, గ్రామపెద్దలు పగడాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం , ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో బాబాకి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, కర్పూర హారతులిచ్చి పూజలు నిర్వహించారు. భక్తులు బాబాని దర్శించుకోగా.. అర్చకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పలువురు దాతలు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు కంచర్ల వెంకటస్వామి తదితరులున్నారు.

మాధవి కరాటేలో మేటి !

- రాష్ట్ర, జాతీయస్థాయిలో బంగారు పతకాలు
- అభినందనలు తెలిపిన ప్రజాప్రతినిధులు



మాధవికి బంగారుపతకం, ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

ఏన్కూరు: నేడు సమాజంలో ధైర్యంగా తిరగాలంటే అడపిల్లలకు ఆత్మరక్షణ ముఖ్యం. తామను తాము కాపాడుకునేందుకు అవసరమైన విద్యలు నేర్చుకోవాలి. ఆత్మరక్షణ కోసం నేర్చుకున్న కరాటే ఆమెకు బంగారు పతకాలు తెచ్చిపెట్టింది. పాఠశాలస్థాయి శిక్షణ తీసుకున్న మాధవి స్నేహితురాలు నిహారిక సాయంతో నైపుణ్యం పొంది బ్లాక్‌బెల్టు సాధించింది.

మండలంలోని తూతకలింగన్నపేటకు చెందిన చల్లా వెంకటేశ్వర్లు – నారమ్మ దంపతుల కుమార్తె మాధవి.. చిన్నతనం నుంచి గురుకులాల్లో చదువుతూ ప్రతిభ చూపింది. వైరాలో పది పూర్తి చేసి అక్కడే కరాటే నేర్చుకుంది. అనంతరం పాల్వంచ సాంఘీక సంక్షేమ గురుకులంలో డిగ్రీలో చదువుతుండగా కరాటేలో ప్రావిణ్యం ఉన్న నిహారిక పరిచయం కాగా.. ఆమె శిక్షణతో బ్లాక్‌బెల్టు సాధించింది. 2021లో ఖమ్మంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. 2022లో ఢిల్లిలో.. బంగారు, వీయంబంజర్‌లో సిల్వర్‌బెడల్, గోవాలో గోల్డ్‌మెడల్ పతకాలు సాధించింది. అదే విధంగా అంబేడ్కర్ జయంతిన హైదరాబాద్‌లో నిర్వహించన పోటీల్లో బంగారు పతకం సాధించింది. 2023లో మలేషియాలో అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కాగా.. ఆర్థిక స్థోమత కారణంగా వెళ్లలేకపోయింది. దీంతో ఆమెను పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఆత్మరక్షణ కోసం కరాటే..



ఆడపిల్లలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయినప్పటికీ మహిళలు అంటే బలహీనులు అని మగవాళ్లు వారిపై అరాచకాలు చేస్తున్నారు. వారి నుంచి మనము రక్షించుకోవాలంటే మనకు ఆత్మరక్షణ ముఖ్యం, అందుకే కరాటే నేర్చుకున్నా.

– చల్లా మాధవి